క్లుప్తంగా

మౌలాలి స్వామి సరిగెత్తు వేడుకలు



కొర్రపోలూరులో కొలువైన మౌలాలిస్వామి పీర్లు

గడివేముల: మండల పరిధిలోని కొర్రపోలూరు గ్రామంలో 15,16 తేదీలలో మౌలాలిస్వామి సరిగెత్తు వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. కులమతాలకు అతీతంగా గ్రామస్తులు, గ్రామపెద్దలు అందరూ కలిసి ఘనంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే మౌలాలి స్వామిని పీర్లచావిడీలో ఏర్పాటు చేశారు.

నేడు ఆళ్లగడ్డకు ఎమ్మెల్యే కాటసాని రాక

గడివేముల: మండల పరిధిలోని మజరా గ్రామమైన ఆళ్లగడ్డలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బండలాగు పోటీలను ప్రారంభించేందుకు ఆదివారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి వస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు రమణారెడ్డి శనివారం తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి పెంచికలపాడులో ఉరుసు



పెంచికలపాడులోని దస్తగిరిస్వామి దర్గా

గూడూరు రూరల్ : మండల పరిధిలోని పెంచికలపాడులో శ్రీ హజరత్ దస్తగిరి స్వాముల ఉరుసు ఉత్సవాలను ఈ నెల 14 నుంచి 16 వరకు నిర్వహించనున్నట్లు శనివారం పీఠాధిపతి అక్బర్ బాషా ఖాద్రి జాగిర్దార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 14న గంధం, 15న ఉరుసు, 16న జియారత్ కార్యక్రమాలను గ్రామ పెద్దలు, ప్రజల సహకారంతో నిర్వహించనున్నామన్నారు. భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని కోరారు.

వేగంగా ఓహెచ్‌ఆర్‌ఎస్ నిర్మాణ పనులు



నిర్మాణంలో ఉన్న ఓహెచ్‌ఆర్‌ఎస్

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో రూ. 78 లక్షలతో నిర్మిస్తున్న ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంక్, పైపు లైన్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఓహెచ్‌ఆర్‌ఎస్, పైపులైన్ పనులు చేపట్టారు. ట్యాంక్ నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

లౌకిక కవనం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సాహితీ స్రవంతి ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన విజయవాడలోని ఎంపీ విజ్ఞాన కేంద్రంలో లౌకిక కవనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ పేర్కొన్నారు. శనివారం టీజీవీ కళాక్షేత్రంలో జరిగిన సాహితీ స్రవంతి విస్తృత స్థాయి సమావేశంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో మతోన్మాదం పెరిగి సమాజంపై విషాన్ని నింపుతోందని ఆరోపించారు. ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరివార్ శక్తుల వల్ల లౌకికత్వం ప్రమాదంలో పడిందన్నారు. దేశంలో నిరంకుశ ధోరణులను నిరసిస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని లౌకిక విలువలను ప్రతిఫలించే, ప్రబోధించే కవితా స్వరాలకు గాయకులతో లౌకిక కవనం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా నాయకులు ఆవుల చక్రపాణి యాదవ్, అయ్యన్న, విజయులు, రాము పాల్గొన్నారు.

టైం స్కేల్ ఇవ్వాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న అర్హులైన నాన్ టీచింగ్ ఉద్యోగులకు టైం స్కేల్ వర్తింపజేయాలని ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రామరాజు డిమాండ్ చేశారు. శనివారం టీఎస్‌ఎఫ్ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న 105 మంది ఉద్యోగులకు టైంస్కేల్ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో టీఎస్‌ఎఫ్ నాయకులు ప్రకాష్, నరేష్‌నాయక్, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా 'జల'ధార

- జల్‌జీవన్ మిషన్‌తో తీరుతున్న వెతలు
- జోరుగా ఇంటింటికీ కుళాయి పనులు
- కోట్ల రూపాయలతో గ్రామాల్లో పైపులైన్
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



పెసరవాయి గ్రామంలో కుళాయిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి (ఫైల్)



ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసిన దృశ్యం

గడివేముల: ఏళ్ల తరబడి తాగునీటి కోసం మండల వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో తీవ్రమైన తాగునీటి సమస్య ఉండడంతో గుక్కెడు నీటి కోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వచ్చేది. పాడైన బోర్లు వలన తాగునీటి ఎద్దడి నెలకొందని.. పాలకులకు పలుమార్లు వినతులు ఇచ్చినా పట్టించుకున్న దాఖలాలు లేవు. గత్యంతరం లేక గ్రామానికి సుదూర ప్రాంతాల్లో ఉన్న నీటి వనరుల నుంచి నీళ్లు తెచ్చుకునే దుస్థితి ఉండేది. కలుషిత తాగునీటి వల్ల తరచూ రోగాల బారిన పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో తాగు నీటి పథకాలు ఏర్పాటుచేసి పైపులైన్ల ద్వారా నీటి సరఫరాకు శ్రీకారం చుట్టింది. దీంతో గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారమైంది. సమస్య పరిష్కారం కావడంతో మండల వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



తీరుతున్న దాహార్తి

జలజీవన్ మిషన్ పథకం మండలంలోని ప్రజల దాహార్తిని తీరుస్తోంది. ఈ పథకం ద్వారా ప్రభుత్వం ప్రతీ ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీటిని సరఫరా చేస్తున్నాది. గడివేముల మండల పరిధిలోని పెసరవాయి ఎస్సీ కాలనీలో రూ.30.80 లక్షలతో ఏర్పాటు చేసిన పైపు లైన్ సంబంధించిన శిలాఫలకాన్ని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఇటీవల ప్రారంభించారు. కాలనీలోని ప్రతి ఇంటికి ఉచితంగా కుళాయి కనెక్షన్ ఇవ్వడంతో కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పైబొగుల రూ.23 లక్షలు, ఉండుట్ల రూ.46 లక్షలు, బూజునూరు రూ.12 లక్షలు, గ్రంధివేముల రూ.10 లక్షలు నిధులు మంజూరు కావడంతో పాటు పనులు పూర్తయినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్ తెలిపారు. పలు గ్రామాల్లో పనులు పూర్తి చేసి ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు సరఫరా చేస్తున్నారు. మిగిలిన గ్రామాల్లో కూడా త్వరలోనే తాగునీటి పథకాలు, పైపులైన్లు, కుళాయి కనెక్షన్లు వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఆనందంగా ఉంది



గతంలో మా కాలనీలో నీరు సరఫరా అయ్యేది కాదు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామంలో ట్యాంకు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తున్నారు. మా ఇంటి వద్ద ఉచితంగా కుళాయి ఏర్పాటు చేశారు. దీంతో ఎంతో కాలం ఉన్న నీటి సమస్య తీరింది. చాలా ఆనందంగా ఉంది.

–ఎర్రోళ్ల సామన్న, పెసరవాయి

రోజూ తాగునీటి సరఫరా



ఏళ్ల తరబడి నీటి సమస్య ఉండేది. జలజీవన్ మిషన్ ద్వారా సమస్య తీరింది. ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటుతో నీటి సమస్య తీరింది. ప్రతి రోజూ సురక్షిత మంచినీరు సరఫరా చేస్తున్నారు. దీంతో నీటి కష్టాలు తీరాయి.

– సుంకమ్మ, పెసరవాయి

ఇబ్బందులు తప్పాయి



వృద్ధాప్యంలో ఉన్న నేను తాగునీటి కోసం నానా అవస్థలు పడేదాన్ని. పంచాయతీ కుళాయి నీరు వచ్చేది కాదు. గ్రామంలోని కాలనీలో వాసుల కష్టాలు అర్థం చేసుకుని కొత్తగా మంచినీటి సరఫరా కోసం పైపులైన్ ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు. ఇప్పుడు మంచినీటి ఇబ్బంది తప్పింది. ఇంటివద్దే కుళాయి ఏర్పాటు చేసి నీరు సరఫరా చేస్తున్నారు.

– వెంకటమ్మ, పెసరవాయి

22 నాటికి ఓటర్ల తుది జాబితా

పాణ్యం : 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈనెల 22 నాటికి తుది ఓటర్ల జాబితా వస్తుందని ఈడీటీ అనురాధ శనివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు కొరకు దరఖాస్తులు స్వీకరించామన్నారు. అలాగే కొత్త ఓటర్లు ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఇటీవల విడుదలైన ముసాయిదా ప్రకారం ఆయా బూత్‌లకు ఓటర్ల జబితాను అందించినట్లు వెల్లడించారు. వీటిలో ఏమైన అభ్యంతరాలు ఉంటే బీఎల్‌ఓలు లేదా ఆయా వీఆర్‌ఓలకు సమాచారం ఇవ్వాలని, లేదా దరఖాస్తు చేయాలని సూచించారు. ప్రస్తుతం పాణ్యం నియోజకవర్గంలో 3,08,340 ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 1,50,895 ఉండగా స్త్రీలు 1,57,064 మంది ఉన్నారన్నారు, 76 మంది ఇతరులు ఉన్నట్లు తెలిపారు. అలాగే సర్వీస్ ఓటర్లు 305మంది ఉన్నారన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 340పోలింగ్ బూత్‌లు ఉన్నట్లు వెల్లడించారు.

సంక్రాంతి సంబరాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

ఓర్వకల్లు : సంక్రాంతి సంబరాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ రాజారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. హిందూ సంప్రదాయ కళలకు ప్రతీకగా నిలిచిన సంక్రాంతి పండుగకు ప్రధానంగా ముగ్గుల పోటీలు, వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించుకోవడం సర్వసాధారణమే అన్నారు. అయితే ప్రజల శాంతిభద్రతకు విఘాతం కల్గించే విధంగా చట్ట విరుద్ధమైన కోడి పందేలు, జూదం, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే కేసులు నమోదు చేసి, రిమాండ్‌కు పంపుతామన్నారు.

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం

- క్రీడాకారుల జ్ఞాపకార్థం పాణ్యంలో కబడ్డీ పోటీలు
- ప్రారంభించిన ఎమ్మెల్యే కాటసాని, ఏఎస్పీ వెంకటరాముడు



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పాణ్యం: రాష్ట్రంలోని క్రీడలను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాణ్యం వ్యాయమ ఉపాధ్యాయులు, కబడ్డీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు, క్రీడాకారిణుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా పురుషుల హోమ్ టీమ్ కబడ్డీ .. మహిళల ఓపెన్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటరాముడుతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 40 సంవత్సరాల్లో మండలం నుంచి కబడ్డీ క్రీడలో వందల మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించారన్నారు. ఎంతో మది ప్రభుత్వ కొలువులు సాధించారన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి క్రీడలు నిర్వహించాలని, తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని చెప్పారు.

ప్రతిభను వెలికి తీసేందుకే 'ఆడుదాం ఆంధ్ర'

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్థాయిలో క్రీడాకారుల ప్రతిభను వెలికితీయాలనే ఉద్దేశంతో ఆడుదాం.. ఆంధ్ర పేరుతో క్రీడలు నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం మండల స్థాయిలో పోటీలు పూర్తి చేశామన్నారు. వచ్చే నెల 15 నాటికి క్రీడలు పూర్తవుతాయన్నారు. కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా నుంచి పురుషుల విభాగానికి 42 టీమ్‌లు, జాతీయ స్థాయి మహిళ విభాగం పోటీలకు 12టీమ్‌లు పాల్గొన్నట్లు తెలిపారు. అనంతరం దివంగతులైన పాణ్యంలోని కబడ్డీ క్రీడాకారులు, వ్యాయమ ఉపాధ్యాయులకు మౌనం పాటించి, శ్రద్ధాంజలి ఘటించారు.

క్రీడాస్ఫూర్తితో ఆడాలి

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని నంద్యాల అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు సూచించారు. జాతీయ స్థాయి మహిళా క్రీడాపోటీలకు వచ్చిన క్రీడాకారులకు అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, సర్పంచ్ మేకల పల్లవి, కో– ఆప్షన్‌సభ్యులు జాకీర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బద్రీనాథ్‌రావు, ఎస్వీవై ఇండస్ట్రీయల్ చెర్మన్ ఎస్వీవై సుజల తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరులో హ్యాట్రిక్ విజయం తథ్యం



కోడుమూరులో శ్రీవల్లెలాంబాదేవికి పూజలు నిర్వహిస్తున్న సమన్వయకర్త డాక్టర్ సతీష్

కోడుమూరు రూరల్ : కోడుమూరు నియోజకవర్గంలో మరో సారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి హ్యాట్రిక్ సాధిస్తామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సతీష్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం కోడుమూరులోని హంద్రీనది ఒడ్డున వెలసిన శ్రీవల్లెలాంబాదేవికి జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డిలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి సారథ్యంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సహకారంతో కోడుమూరులో మూడో సారి కూడా విజయం సాధిస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలే పార్టీని గెలిపిస్తాయన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని జగనన్న నెరవేర్చారని, గతంలో ఏ నాయకుడు కూడా ఇలాంటి స్వచ్ఛమైన పాలనను ప్రజలకు అందించలేదని చెప్పారు. ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ చంద్రబాబు బూటకపు మాటలు చెబుతూ, నెరవేర్చలేని హామీలిస్తూ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని, ప్రజలే వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచు ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, నాయకులు మల్లారెడ్డి, తేనేశ్వరరెడ్డి, ప్రసాద్, లింగమూర్తి, సందీప్, మహేశ్వరరెడ్డి, వీరన్న, సద్దల శ్రీనివాసులు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ కుటుంబానికి అండగా ఉంటాం



ఆంజనేయులు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల ఓబులేసు

కర్నూలు(హాస్పిటల్): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఆంజనేయులు కుటుంబానికి అండగా ఉంటామని ఏపీఎస్‌ఆర్‌టీసీ కడప జోనల్ చైర్‌పర్సన్ మాల్యావంతం మంజుల ఓబులేసు హామీ ఇచ్చారు. కల్లూరు మండలం ఉలిందకొండ వద్ద శుక్రవారం అర్ధరాత్రి ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ ఆంజనేయులు మృతి చెందగా, 15 మందికి పైగా గాయపడ్డారు. గాయపడిన వారిని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స చేయించారు. మృతి చెందిన ఆంజనేయులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. శనివారం ఆయన మృతదేహాన్ని జోనల్ చైర్‌పర్సన్ మాల్యావంతం మంజుల ఓబులేసు సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రమాద వివరాలను స్థానిక ఎస్‌ఐని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రమాద సంఘటనా స్థలాన్ని ఆమె పరిశీలించారు. ఆమె వెంట కర్నూలు డిపో అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కుడా చైర్మన్‌ను కలిసిన కోడుమూరు సమన్వయకర్త



కుడా చైర్మన్‌ను పూలమాలతో సత్కరిస్తున్న కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త సతీష్

కర్నూలు (సిటీ): కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన డాక్టర్ ఆదిమూలపు సతీష్ శనివారం నగరంలోని వెంకటరమణ కాలనీలో కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కుడా చైర్మన్‌ను పూల మాలతో సత్కరించారు. అనంతరం ఇరువురు నియోజకవర్గంలోని సమస్యలపై చర్చించారు. జగనన్నను మరోసారి సీఎంగా చేసుకునేందుకు రాబోయే ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందాలి



మహిళలకు చీర సారె అందజేస్తున్న పర్యవేక్షణాధికారి కిరణ్‌కుమార్

కర్నూలు (టౌన్): కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకోవాలని కేంద్ర ప్రభుత్వ వికసిత భారత సంకల్ప యాత్ర పర్యవేక్షణ అధికారి కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పథకాల అమలును పరిశీలించారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్‌తో కలిసి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళలకు చీరె, సారె అందించారు. కార్యక్రమంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు మన్సూర్, ఆలీ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు(అర్బన్): జిల్లా కురువ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను గద్వాల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరితమ్మ ఆవిష్కరించినట్లు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఎంకే రంగస్వామి తెలిపారు. కురువ కులస్తులు ఆర్థికంగా ఎదగాలని, రాజకీయంగా ముందుంటు తమ పిల్లల ను ఉన్నతంగా చదివించాలని ఆకాంక్షించారన్నారు. కార్యక్రమంలో తిరుపతయ్య, సంఘం నాయకులు దేవేంద్ర, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'పచ్చి రొట్ట'పై రైతులకు అవగాహన కల్పించండి

- దేశీ శిక్షణా కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏఓ మాధురి

కర్నూలు(అగ్రికల్చర్):వ్యవసాయంలో పచ్చి రొట్ట ఎరువులకు విశేషమైన ప్రాధాన్యత ఉందని, వీటి గురించి రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి మాధురి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లొమ కోర్సుపై నిర్వహించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రధానంగా వరిలో నాట్లకు ముందు పచ్చి రొట్ట ఎరువులు ఎక్కువగా వినియోగిస్తారని తెలిపారు. పిల్లి పెసర, జీలుగను పచ్చి రొట్ట ఎరువులుగా వినియోగించవచ్చని తెలిపారు. విశ్రాంత జేడీఏ, దేశీ కార్యక్రమ సమన్వకర్త జయచంద్ర మాట్లాడుతూ... ఇన్‌పుట్ డీలర్లు నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటారని, రైతులకు చక్కటి సలహాలు, సూచనలు ఇచ్చి అన్ని విధాల సహకరించాలని పేర్కొన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ నికరాదాయం పొందే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వ్యవసాయంలో శాస్త్రీయ పరిజ్ఞానం పొంది రైతులకు ఉపయోగపడాలనే లక్ష్యంతోనే ఇన్‌పుట్ డీలర్లకు డిప్లొమ కోర్సుపై శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన 40 మంది ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తేనే మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖరప్ప

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఆరు లక్షలకు పైగా ఓటర్లు ఉన్న వీర శైవ లింగాయతీ, జంగమ మహేశ్వరులకు రానున్న ఎన్నికల్లో రాజకీయ అవకాశాలు కల్పించే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని వీరశైవ రాజకీయ వేదిక నేతలు అన్నారు. శనివారం స్థానిక ఏ క్యాంప్‌లోని హార్ట్ ఫౌండేషన్ సెంటర్ కార్యాలయ సమావేశ భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో వేదిక కన్వీనర్ జేపీ మల్లికార్జునయ్య, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీ మల్లికార్జునప్ప, చంద్రశేఖరప్ప మాట్లాడారు. గతంలో కర్నూలు పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైన చరిత్ర వీరశైవ లింగాయతీలదన్నారు. జిల్లాలోని ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో వీరశైవ లింగాయతీ ఓట్లు అధికంగా ఉన్నాయన్నారు. అలాగే నామినేటెడ్ పదవులు, ఎమ్మెల్సీ పదవుల్లో తమకు ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. తమకు ఓబీసీ రిజర్వేషన్ కల్పించే విషయంలో కూడా ఆయా రాజకీయ పార్టీలు స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. అలాగే శ్రీశైల మహాక్షేత్రంతో పాటు అన్ని శివాలయాల్లో వీరశైవులు, జంగమ మహేశ్వరులకు ప్రాధాన్యత పెంచాలన్నారు. సమావేశంలో నాయకులు జంగమ కోటేశ్వరయ్య, పతంజలి శివరాజు, బద్రీస్వామి, వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

కామాంధుడిని కఠినంగా శిక్షించాలి

కర్నూలు(సెంట్రల్): దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామానికి చెందిన పసిపాపపై అత్యాచారం చేసిన అదే గ్రామానికి చెందిన మునిరంగడుపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఐద్వా, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శులు అలివేలు, ఎండీ ఆనందబాబు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట ఆ సంఘాల ఆధ్వర్యంలో కామాంధుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితుడికి శిక్ష పడేలా చేయకపోతే ఎస్పీ ఆఫీసును ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్‌జీ కృష్ణ, డి.వి జయమ్మ, షబానా పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో కర్నూలుకు కాంస్యం



మూడోస్థానంలో నిలిచిన జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు

కర్నూలు (టౌన్): ఈ నెల 12న రాజంపేటలో నిర్వహించే 45 వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. ఈ జట్టును శనివారం రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నిర్వహణ కార్యదర్శి రామాంజనేయులు ప్రత్యేకంగా అభినందించారు.

జల్ల బాబు మృతి తీరని లోటు

కర్నూలు కల్చరల్: పౌరాణిక నాటక రంగంలో జల్ల బాబు మరణం తీరని లోటు అని పలువురు కళాకారులు పేర్కొన్నారు. శనివారం సి.క్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జల్ల బాబు సంస్మరణ సభ జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాకారులు మాట్లాడుతూ శ్రీకృష్ణ, అర్జున, భవాని వంటి పాత్రలను పోషించి మెప్పించారన్నారు. కర్నూలు మార్కెట్ యార్డులో ఆయన నెలకొల్పిన పద్యనాటక సమాజం ఆయన మరణంతో నష్టపోయిందన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, జల్లబాబు కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సహాయం ప్రకటించారు. అనంతరం విశ్వకళావాహిణి అధ్యక్షుడు మనోహర్ బాబు ఆధ్వర్యంలో శ్రీకృష్ణ రాయబారం, చింతామణి, భవాని, అల్లూరి సీతారామరాజు నాటకాల్లోని సన్నివేశాలను కళాకారులు ప్రదర్శించారు. మహమ్మద్ మియా, దస్తగిరి, ఏసు, రాజశేఖర్, పాండురంగయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జన ఔషధ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



సి.బెళగల్లో జన ఔషధ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ అధ్యక్షురాలు విజయ మనోహరి

సి.బెళగల్: ప్రజలు ప్రభుత్వాల భాగస్వామ్యంతో గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న జన ఔషధ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) అధ్యక్షురాలు విజయ మనోహరి అన్నారు. శనివారం మండలం కేంద్రం సి.బెళగల్లోని బస్టాండ్ ఆవరణలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) కార్యాలయంలో నూతన జన ఔషధ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించి ప్రజలకు మందులను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు తక్కువ ధరలకు నాణ్యమైన మందులు అందించాలన్న సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ప్రజలకు జన ఔషధ కేంద్రాల ద్వారా అతి తక్కువ ధరలకు (దాదాపు 80 శాతం ధరలకు) దీర్ఘకాలిక రోగాలకు, రెగ్యులర్ మందులు, అదే విధంగా మహిళలు, బాలలకు పౌష్టికాహారం లభిస్తాయని తెలిపారు. కాగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో సహకార సంఘాల ద్వారా 14 జన ఔషధ కేంద్రాలను ప్రారంభించినట్లు డీసీసీబీ సీఈఓ రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గోపాల్ రెడ్డి, ఆప్‌కాబ్ డీజీబీ విజయ్‌కుమార్, పీఏసీఎస్ సీఈఓ రవికుమార్‌రెడ్డి, మేనేజర్ అయ్యసువామి తదితరులు పాల్గొన్నారు.